కథ



# ఆ కబురు చేరలేదు

'ప్రష్యామి'

ఆదివారం...

హాయిగా వరండాలో చాప వేసుకుని, రకరకాల పత్రికల ఆదివారపు అను బంధాలు చదువుతూ కూర్చున్నాను.

నాకు యిష్టమైన హాబీల్లో అదొకటి! చాలా తమాషా వార్తలు, ఆసక్తిదాయకమైన కథనాలు అనుబంధాల్లో వుండటం వల్లనే కాకుండా, నాకు కాస్త తీరిక అంటూ దొరికేది ఆదివారమే!

మధ్యాహ్నం వరకూ ఆదివారం నా సొంతం! ఆ తర్వాత నా భార్యాపిల్లల యిష్టం.

వాళ్ళూ సినిమా అంటే సినిమా, పార్క్ అంటే పార్క్...

వంటింట్లో నుంచి ఆ రోజుకి మూడో కప్ టీ వచ్చింది. యాలకుల పరిమళం సనసన్నగా టీని అలుముకుని వుంది.

టీ తాగుతూ ఓ పత్రికలో గళ్ళ నుడికట్టు పూర్తి చేస్తుంటే, గేటు తెరిచిన చప్పుడయింది.

తలెత్తి చూశాను.

ఎదురుగా శ్రీకర్... వెనకే వాడి శ్రీమతి... 'ఏరోయ్, చాలా రోజుల తర్వాత కనబడ్డామే'' అన్నాను లేస్తూ.

''నువ్వు కనబడ లేదురా - మేము వెదుక్కుంటూ వచ్చాం' శ్రీకర్ షూస్ విప్పుకుని, నా ఎదురుగా చాపమీద కూర్చుండి పోయాడు.

''ఛాయా... శ్రీకర్ వాళ్ళ ఫ్యామిలీ వచ్చారు'' అని వంట గదిలోకి వినబడేలా కేకవేశాను. శ్రీకర్ భార్య లోపలకు వెళ్ళింది.

శ్రీకర్ నేను కాకినాడలో చదువు కున్నప్పుడు నా క్లాస్‌మేట్! ఆ తర్వాత మళ్ళీ చాలా రోజులకు విజయవాడలో కలుసుకున్నాం - ఇద్దరికీ అదే వూరిలో ఉద్యోగం రావడంతో.

''ఎక్కడరా - తీరిక అంటూ దొకడం లేదు! ఆఫీసులో కూడా పని ఎక్కువ వుండటంతో ఫోన్ చేయడం అయినా కుదరలేదు'' అన్నాను.

''నువ్వు వేరేలా ఫీల్ కాకు! సిటీలో బిజీలైఫ్ నీకు తెలియనది కాదు'' మళ్ళీ క్షమాపణా పూర్వకంగా చెప్పాను.

''ఏదో సరదాగా అన్నానురా! నువ్వేమిటో నాకు తెలియదా?'' ఆప్యాయపూర్వకంగా నా చేతిని నొక్కుతూ చెప్పాడు శ్రీకర్.

''ఏమిటి విశేషాలు?'' అడిగాను.

''నీ ఎదుట పేపర్లలో యిన్ని వార్తలు, విశేషాలు పెట్టుకుని మళ్ళీ నన్నడుగుతావేరా?'' నవ్వాడు శ్రీకర్.

''అఫ్‌కోర్స్, పేపర్లలో మన చుట్టాలు, స్నేహితుల గురించి రాయరుగా! రాయాలంటే వాళ్ళు రాజకీయాల్లోకి అయినా చేరాలి, నేరాలయినా చెయ్యాలి''

హఠాత్తుగా శ్రీకర్ ముఖంలో కాంతి తగ్గింది. నా జోక్‌ని ఎంజాయ్ చేయలేనట్లు గంభీరంగా చూశాడు నాకేసి.

''ఈ మధ్య కాకినాడ వెళ్ళానురా!'' అన్నాడు శ్రీకర్.

''అలాగా - ఏమిటి విశేషాలు? మన వాళ్ళెవరయినా కలిశారా?''

నేను కాకినాడ వెళ్ళి, చాలా కాలం కావస్తుంది. ఎప్పటికప్పుడు వెళ్దామనుకుంటూనే వాయిదా పడుతోంది.

ఎంత కాదనుకున్నా అందమైన బాల్యాన్ని ఇచ్చిన వూరిని, స్నేహితులను మర్చిపోలేము. అవన్నీ తల్చుకుంటుంటే ఎంత ఆనందంగా, ఆహ్లాదంగా వుంటుందో చెప్పలేను.

అవకాశం దొరికితే కాకినాడ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదామన్పిస్తుంటుంది ఒకోసారి.

శ్రీకర్ నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

''నీకు తెలియదు?'' అన్నాడు.

''ఏమిటి?'' ఏదో అనుమానానికి నాంది పలికింది.

''సారీ... నీకో బాడ్‌న్యూస్! నీకీ పాటికి తెలిసే వుంటుందనుకున్నాను.

నీ ఫ్రెండ్... అదే మీ చుట్టాలబ్బాయి. పాన్‌షాప్ విష్ణు... పోయాడురా!'' పదం పదం కూడబలికి చెప్పాడు శ్రీకర్.

అది నేనూహించని వార్త!

ఎందుకో. మనసు మొద్దుబారినట్లుగా, బరువెక్కినట్లుగా... గుండెల్లో చెమ్మ కళ్ళల్లోకి ప్రాకి, కన్నీరుగా బయటపడింది.

''ని...జ...మా? ఎప్పుడు... ఎలా జరిగింది?'' నా గొంతు వణకడం నాకు తెలుస్తోంది.

''కామెర్లురా! 'వెల్ల' మందుకి తీసుకెళ్ళేటప్పటికే ముదిరిపోయిందట. పోయి వారం కావస్తుంది. సరిగ్గా విష్ణు చిన్నదినం రోజునే నేను కాకినాడలో వున్నాను. వెళ్ళి చూసొచ్చాను.

చూస్తే జాలేసిందిరా! ముగ్గురూ అమ్మాయిలయ్యారు. కొడుకేమో చేతికి రాలేదు. ఏదీ... మొన్నటి దాకా ఏ వ్యాపారంలోనూ కుదురుగా వుండలేదు. బ్యాంక్‌లో లోను తీసుకుని ఆ పాన్‌షాప్ పెట్టాడు. ఆ అప్పు ఇంకా తీరలేదు.

విష్ణు పోయాడన్న బాధ ఒకటి, నిజంగానే వారి యింట్లో వాళ్ళని దిక్కులేకుండా చేశాడనే వేదన మరొకవైపు...

ఆ షాక్‌లో నీకు టెలిగ్రామ్ ఇవ్వలేదేమో?'' చెబుతున్నాడు శ్రీకర్.

''విష్ణు... విష్ణూ!'' వెక్కెక్కి ఏడవ సాగాను.

''కంట్రోల్ యువర్‌సెల్ఫ్! నాకంటె విష్ణు నీకు మరింత ఆప్తమిత్రుడని నాకు తెలుసు. ఎవరు మాత్రం ఏ చేయగలము?

దేవుడు రాసిన రాతను నువ్వూ, నేనూ మార్చలేము కదా! బాధను దిగమింగుకుని, విష్ణు జ్ఞాపకాలు తలచుకుని గడపడమే'' అనునయించాడు శ్రీకర్.

నిజంగా గత జ్ఞాపకాల తీపితో ఈ కఠోర సత్యయపు గరళాన్ని దిగమింగగలమా?

తలుచుకున్న కొద్దీ దుఃఖం ఎక్కువయ్యేదే తప్ప, తగ్గేది కాదు.

విష్ణు నేను అయిదో తరగతి చదివినప్పటి నుంచి పరిచయం. స్నేహితుడుగా మొదట కలిసినా, ఆ తర్వాత మాకు దూరపు బంధువు అవుతాడని తెలిసింది.

వేసవి సెలవులు వస్తే ధవళేశ్వరం వెళ్ళేవాణ్ణి. అక్కడికి వచ్చేవాడు విష్ణు.

గోదారిలో పొద్దున్న పూట స్నానం, మధ్యాహ్నం వేళల్లో యింట్లో వైకుంఠపాళీయో, అష్టాచమ్మా ఆటలు... సాయంత్రం జనార్దనస్వామి కోవెలకు పరుగెత్తే వాళ్ళం.

రాత్రుళ్ళు మా కస్తూరి అక్కడ మా అందరికి చందమామ కథలు, రష్యన్ చిన్నపిల్లల గాథలు చెబుతుండేది. ఎన్నెన్నో ఉల్లాసాలు... అల్లరి ఆటపాటలు.

చిన్నప్పుడు ఆటల్లో పాలు పంచుకున్న విష్ణు పెద్ద అయ్యాక నా కష్ట సుఖాల్లో అండగా నిలిచాడు.

అమ్మ పోయినప్పుడు నన్ను ఓదార్చింది వాడే!

ఇంటర్మీడియెట్ రోజుల్లో వయసు రెచ్చగొట్టిన కోరికల వేడిలో నేను తప్పటడుగులు వేయబోయినప్పుడు మందలించి, సరి చేసింది వాడే!

మా తరపువాళ్ళు ఛాయతో నా పెళ్ళికి అంగీకరించక పోతే అన్నవరం సత్యనారాయణస్వామి గుడిలో దగ్గరుండి, పెళ్ళి జరిపించింది వాడే!

జీవితపు అతి ముఖ్యమైన మలుపుల్లో అండగా నిలిచాడు విష్ణు.

నేనే వాడికి తిరిగి ఏమీ చేయలేకపోయాను.

నాకు అదృష్టవశాత్తూ ఎల్ఐసిలో జాబ్ వచ్చింది.

కాకినాడలోనే వుండిపోవాలన్న కోరికతో విష్ణు వ్యాపారం ప్రారంభించాడు. బేకరీ, ఫ్లోర్‌మిల్... ఏదీ వాడికి కలిసి రాలేదు పెళ్ళయ్యింది. అప్పటికే ఆర్థికంగా చితికిపోయాడు. ఈ మధ్యయనే మంచి సెంటర్‌లో పాన్‌షాప్ పెట్టాడని, బాగానే వుందని విన్నాను

ఇంతలోనే ఈ దుర్వార్త...

చెప్పలేని దిగులుగా, వంటరి వాణ్ణి అయిపోయినట్లు ఆలోచనలు...

''పెద్దకర్మ ఈ వారంలోనే కావచ్చు. మరి పదమూడో రోజు చేస్తారు, పదిహేనో రోజు చేస్తారు. అయినా కార్డ్ వస్తుందిగా! వెళ్ళిరా!'' అని భుజం తట్టాడు శ్రీకర్.

అప్పుడే బయల్దేరి వెళ్ళిపోవాలన్నంత ఉద్వేగం కుదిపేసింది నన్ను.

ఆఫీసు బాధ్యతలు అడ్డుపడ్డాయి. దినానికి వెళ్దామనుకున్నాను. కార్డ్ చూసి సెలవు పెట్టాలని నిర్ణయించుకున్నాను.

ఆ రోజు సాయంత్రం కూడా యింటికి రాగానే అడిగాను ఛాయను'' ఏమన్నా వచ్చిందా పోస్ట్?''

ఛాయ అడ్డంగా తలాడించింది.

''దినం కార్డ్, ఇంట్లో వుంచితే అమంగళం అని చింపి పడేస్తావేమో? కనీసం వరండా కిటికీలో అయినా వుంచు!'' చెప్పాను.

ఆ రోజు, మరుసటి రోజు, ఆపై రోజు వరుసగా చూశాం. కబురు రాలేదు!

శ్రీకర్‌కి ఫోన్ చేసి అడిగాను. ''ఏరా - విష్ణు... నీకేమన్నా వచ్చిందా కార్డ్?''

''లేదురా - నా అడ్రసు వాళ్ళదగ్గర వుందో లేదో. నువ్వు అయినవాడివి కదా! నీకు తప్పకుండా కబురు అందాలే!'' అన్నాడు శ్రీకర్.

విష్ణు పరిస్థితి (ఆర్థికంగా) బాగా లేదని తెలిసి కూడా నేను వెళ్ళలేదని వాళ్ళింట్లో వాళ్ళకు నా మీద కోపం వచ్చిందా?

లేక వాడి చావు కబురు తెలిసి నేను తట్టుకోలేనని రాయలేదా? ప్రాణ స్నేహితుడే గాని, ఆ కబురు తెలియగానే ఆగిపోయేటంతటి మమకారపు గుండె నాకు లేదుగా?!

ఛాయతో నా వేదన వెల్లబోసుకున్నాను.

''దినం రోజునే వెళ్ళాలనేముంది? అయినా పోస్టల్‌లో కార్డు మిస్ అయ్యిందేమో?! మీరు దాని గురించి ఇంత బాధపడాలా? చాలా చిన్న విషయం'' అంది ఛాయ.

''విష్ణు భార్యని ముత్తయిదువగానే చూడాలిగా!'' అన్నాను.

దురదృష్టం.

సమయానికి సెలవు దొరకలేదు. దినం 17వ తేదీన అయితే, నాకు 23వ తేదీ కార్డ్ వచ్చింది. చూసి చింపి పడేశాను.

ఆ రోజే శ్రీకర్ ఫోన్ చేశాడు. ''విష్ణు దినం కార్డ్ ఈ రోజే వచ్చిందిరా! పోస్టల్ డిలే అనుకుంటా. అయిపోయింది. నీకూ వచ్చివుండాలే!''

''అవును, వచ్చింది!'' అన్నాను ముభావంగా.

''ఏరా ఇంకా డిప్రెషన్‌లోనే వున్నట్లున్నావు?'' నా గొంతుల్లో తేడా గుర్తించి అడిగాడు శ్రీకర్. ''తేరుకోరా... తేరుకో!'' అన్నాడు.

''బాధ విష్ణుపోయినందుకే కాదురా!''

''మరి?...'ఆశ్చర్యం శ్రీకర్ స్వరంలో..

''మనిషి బ్రతకడానికి అవసరమైన డబ్బు, బాధని పంచుకోవడానికి అడ్డు పడటం కన్నా విషాదం మరేం వుందిరా!'' వణుకుతున్న గొంతుతో చెప్పాను.

''నీ మాటలు నాకు అర్థం కాలేదురా''

''నువ్వు గమనించావో - లేదో! ఆ కార్డ్ మీద పోస్ట్ చేసిన తేదీ 19! పెదకర్మ అయిపోయాకే పోస్ట్ చేశారు. ముందే అందితే, అందరూ వస్తారని, వారి దుఃఖం పంచుకున్నా, పంచుకోక పోయినా వారి ఋణభారం మనం పెంచుతామని ఆలస్యంగా పోస్ట్ చేశారు.

విషాదాన్ని పంచుకొని, ఓదార్పు అందించే సమయం శాస్త్రోక్తమైన తంతుగా, ఆర్థిక భారంగా మారిపోయాక ఏం మాట్లాడమురా?''